## జిల్లా కోర్టు హాల్‌లో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్, నల్సా ఆదేశాల ప్రకారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ క్యాంపెయినింగ్‌లో భాగంగా బుధవారం జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత ఉన్న విచారణ ఖైదీల విడుదల అంశంపై సమావేశం నిర్వహించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, కొత్తగూడెం ఓఎస్డీ, కొత్తగూడెం డిస్ట్రిక్ట్ క్రైం బ్రాంచ్ డీఎస్పీ, ఖమ్మం డిస్ట్రిక్ట్ జూలార్ లక్ష్మీనారాయణ, భద్రాచలం సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్, ఇల్లెందు స్పెషల్ సబ్ జైల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తం, డిప్యూటీ కౌన్సిల్ నిరంజన్‌రావు, ఏజీపీ బాబురావు, జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, కలెక్టర్ సూపరింటెండెంట్, లైజన్ ఆఫీసర్ వీరబాబు, హరిగోపాల్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు



మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్



రెండవ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే.సాయిశ్రీ

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: జిల్లా కేంద్రంలోని కోర్టులో న్యాయమూర్తులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమితులైన కే.సాయిశ్రీ బుధవారం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుచరిత నుంచి బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఎల్ పట్టా పొందారు. మూడవ అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా వాంకుడోత్ శివనాయక్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. వారు ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గురువారం మండలంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సుజాతనగర్ మండలం మెయిన్‌రోడ్‌న బాలాజీనగర్ వద్ద గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రొసీడింగ్స్ పత్రాలు అందించనున్నట్లు ఎంపీడీవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, లబ్ధిదారులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## గణేశ్ టెంపుల్‌లో ఆర్‌జేసీ రామకృష్ణారావు పూజలు



పూజలు చేస్తున్న ఆర్‌జేసీ రామకృష్ణారావు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎంజీరోడ్‌లోని విజయవిఘ్నేశ్వర స్వామి దేవస్థానాన్ని బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (ఆర్‌జేసీ) ఎం.రామకృష్ణారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, కమిటీ సభ్యులు ఆర్‌జేసీకి పుష్పగుచ్ఛాన్ని అందించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సహాయ కమిషనర్, పరిశీలకులు, కార్యనిర్వహణాధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూట్‌బ్యాగ్‌ల తయారీకి దరఖాస్తుల సేకరణ

రామవరం, అక్టోబర్ 4: ఎంఎస్ఎంఈ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో సింగరేణి సేవా సమితి ద్వారా జూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇచ్చేందుకు స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణకు ఆసక్తి కలిగిన ఉద్యోగుల కుటుంబాల మహిళలు, పరిసర ప్రభావిత గ్రామాల మహిళలు దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేసి ఏరియాలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో కానీ సింగరేణి సేవా సమితి కో ఆర్డినేటర్ సాగర్ 9502190113కు కాల్ చేసి దరఖాస్తులు ఈ నెల 8వ తేదీలోపు అందించాలని తెలిపారు.

# పెద్దమ్మతల్లి దయతో మళ్లీ అవకాశం వచ్చింది

### ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ రూరల్, అక్టోబర్ 4: పెద్దమ్మతల్లి దయతో మళ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కలిగిందని, అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో రూ.7కోట్ల ఆలయ నిధులతో నిర్మించిన రెండు ఏసీ ఫంక్షన్ హాళ్ళను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాడు ఈ ఆలయం ఎంతో చిన్నగా ఉండేదని, అమ్మవారిని దర్శించుకునే భక్తుల రాకతో నేడు ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆలయం జిల్లాలో ప్రముఖ దేవాలయంగా వ్యాప్తి చెందుతుందని, శివాలయ నిర్మాణం త్వరలో పూర్తి కానున్నదని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వనమా ముందుగా పెద్దమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ-ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం. రామకృష్ణారావు, జిల్లా సహాయ కమిషనర్ సులోచన, ఈవో రజనీకుమారి, మల్లూరు ఈవో సత్యనారాయణ, కొత్తగూడెం భద్రాచలం, ఖమ్మం డివిజన్ పరిశీలకులు బేల్‌సింగ్, వెంకటేశ్వర్లు, సమత, ధర్మకర్తల మండలి అధ్యక్షులు మహీపతి రామలింగం, సర్పంచ్ అనిత, జడ్పీటీసీ వాసుదేవరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల, రైతుబంధు సమితి నాయకులు కిలారు నాగేశ్వరావు, నూతక్కి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### మనందరికి సీఎం కేసీఆర్ అండ..

పాల్వంచ రూరల్, అక్టోబర్ 4: మీకు నేను.. నాకు మీరు, మనందరికి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని సంగంగట్టు గ్రామంలో బుధవారం రూ.20 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులకు ఆయన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. సీఎం కేసీఆర్ తనను మళ్లీ బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాల్సిందిగా ఆహ్వానించారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీడీవో అప్పారావు, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, ఏఈ అనిల్, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడి సరస్వతి, సర్పంచ్ మక్బూల్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు రాజూగౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, ఇతర ప్రముఖులు ఎస్వీ ఆర్కే ఆచార్యులు, పాపారావు, విజయ్, లక్ష్మీనారాయణ, పోలెబోయిన వీర్రాజు, వెంకటేశ్వరావు, దాసరి నాగేశ్వరావు, రాము, దుర్గా ప్రసాద్, చిరంజీవి, సత్యనారాయణ, వెంకటరెడ్డి, బాబు పాల్గొన్నారు.

# నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీలు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (నమస్తేతెలంగాణ): 24 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు ఎట్టకేలకు సమ్మె విరమించారు. గతంలో ఏ ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు జీతాలు పెంచిన దాఖలాలు లేవు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలపై స్పందించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఆర్‌సీతోపాటు ఐఆర్ వర్తించేలా హామీ ఇచ్చింది. దీంతో పాటు టీచర్లు పదవీ విరమణ చేస్తే రూ.2 లక్షలు, ఆయా పదవీ విరమణ చేస్తే రూ.1 లక్ష ఇచ్చేలా ప్రభుత్వం హామీ ఇవ్వడంతో టీచర్లు ఆయాలు సమ్మె విరమించారు. మంత్రులు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్‌లు ఆయా యూనియన్ నాయకులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కారం చేశారు. దీంతో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. 24 రోజులు పాటు చేసిన సమ్మె కాలంలో వేతన వచ్చేలా చర్యలు తీసుకున్నది.

### తెలంగాణ వచ్చాక మూడు సార్లు వేతనాలు పెంపు

తెలంగాణ వచ్చాక ఇప్పటి వరకు ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను మూడు సార్లు పెంచింది. గతంలో 6000 ఉన్న టీచర్ జీతం తెలంగాణ వచ్చాక తొలిసారిగా 7,500, తర్వాత 10,500 పెంచింది. దీంతో పాటు మరోసారి వారి సమస్యలను గుర్తించిన సీఎం కేసీఆర్ వారు అడగకుండానే వారి వేతనాన్ని 13,650 పెంచారు. దీంతో పాటు మినీ టీచర్లను కూడా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసి, వారిని రెగ్యులర్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించింది. ఇప్పుడు మరోసారి కొత్త పీఆర్‌సీతో పాటు వేతనాన్ని పెంచనున్నది.

## వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం



నీటి కుంటలను చూపిస్తున్న అటవీశాఖాధికారులు

జూలూరుపాడు, అక్టోబర్ 4: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ అధికారులు మండల కేంద్రంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుండెపుడిలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులను రిజర్వ్ ఫారెస్ట్‌కి తీసుకెళ్లి వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెక్‌డ్యాంలను చూపించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ప్రసాదరావు పేర్కొన్నారు. అటవీశాఖాకాధికారులు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, నర్సింహారావు, కిషన్, సాల్మన్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగులో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చుంచుపల్లి, అక్టోబర్ 4: మండలంలోని రైతులు మొక్కజొన్న సాగులో మెళకువలు పాటించాలని, తద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరావు అన్నారు. కేవీకే కొత్తగూడెం ఆధ్వర్యంలో పెనగడపలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేయవచ్చని, వరి కోత కోసిన తర్వాత దుక్కి దున్నకుండా శూన్య దుక్కి పద్ధతిలో విత్తుకుంటే దుక్కి ఖర్చు ఆదా అవుతాయని అన్నారు. నీటి తడులను బట్టి స్వల్ప, మధ్యకాలిక హైబ్రిడ్ విత్తనాలను ఎంపిక చేసుకొని రైతులు విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మమత, సర్పంచ్ మాలోత్ కళావతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్

చుంచుపల్లి, అక్టోబర్ 4: వారం రోజుల్లో ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, గుమస్తాలు, బిల్ కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. సిబ్బంది జీతాలు, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్ బకాయిలను ప్రతి నెల 3వ తేదీలోపు చెల్లించాలని, ఇంటి పన్నులు వారం రోజుల్లో నూరుశాతం వసూలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. వైకుంఠధామం, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీల నిర్వహణ, పంచాయతీ సమావేశాలు, గ్రామసభలు నిర్వహణ, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించేందుకు సూచనలు చేయాలని అన్నారు. పంచాయతీ భవన నిర్మాణ పనుల వివరాలు తెలుసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగమ్మ, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, గుమస్తాలు పాల్గొన్నారు.

## రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4: సింగరేణి సంస్థలో ఇటీవల జరిగిన జూనియర్ అసిస్టెంట్ రాత పరీక్షలో అర్హత సాధించిన గ్రేడ్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండోరోజు కూడా కొనసాగింది. 177 పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష నిర్వహించగా అందులో అర్హత సాధించిన వారికి మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు సింగరేణి హెడ్డాఫీస్‌లో పరిశీలన చేశారు. మొదటి రోజు 85 మందికి, రెండవ రోజు 85 మందికి అవకాశం కల్పించారు. రెండో రోజు 85 మందికి గాను 79 మంది హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. రెండు రోజుల పాటు పరిశీలనలో పాల్గొన్న వారికి మెడికల్ టెస్టుల కోసం సింగరేణి ప్రధాన ఆస్పత్రికి పంపించారు. మెడికల్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే నియామక పత్రాలను అందజేయనున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ ఆర్‌సీ) కే.బసవయ్య తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

జూలూరుపాడు, అక్టోబర్ 4: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని ఒంటిగుడిసె క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలీసు సిబ్బంది ఒంటిగుడిసె క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును నిలిపారు. కారు వెనకనే ఏన్కూరు మండలం భద్రుతండాకు చెందిన తేజావత్ చంటి, బానోత్ వెంకటేశ్ ద్విచక్రవాహనంపై వచ్చి కారును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు బీటీ రోడ్డుకు తగలడంతో చంటి, వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.